RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ మంగళవారం 14.04.2026 సంపుటి : 03 సంచిక : 128 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Tuesday 14.04.2026 Volume: 03 Issue 128 Pages 08 Cost 5/

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION
మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

## దళితులకు మతం మారే

# స్వేచ్ఛ లేదా?



హైదరాబాద్ , ఏప్రిల్13: క్రైస్తవ మతాన్ని స్వీకరించిన బీసీలు, ఎస్టీలు, అగ్రవర్ణ పేదలకు(ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల పరంగా లేని ఆంక్షలు దళితులకు మాత్రమే ఎందుకున్నాయని.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నిలదీశారు. ఆనాడు దేవాలయాల్లోకి దళితులను రావద్ద న్నారు.. ఈనాడు ఇంకో దేవాలయానికి వెళ్లొద్దంటున్నారు.. ఇంకెంతకాలం ఈ వివక్ష అని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా వర్గాల మాదిరిగా దళితులకు మతం మారే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను నిరాకరిస్తూ వెలువడిన 1950నాటి రాష్ట్రపతి ఉత్తర్వు లను ప్రస్తుత రాష్ట్రపతి రద్దు చేయాలని, అందుకు ప్రధాని మోదీ చొరవ తీసుకోవాల ని కోరారు. ఆర్టికల్ 14, 15, 25 ప్రకారం నచ్చిన మతాన్ని ఎంచుకునే స్వేచ్ఛ దళితులకు ఉండాలన్నారు. దళిత క్రైస్తవుల కు ఎస్సీ హోదాను సుప్రీంకోర్టు నిరాకరిం చడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించింది. దీనికి హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ... 'ఆనాటి ప్రధాని నెహ్రూ, రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, హిందూ మహాసభ సభ్యుడు కేఎం మున్షీ, క్రైస్తవుల ప్రతినిధి హెచ్‌జీ ముఖర్జీ... ఈ నలుగురు బ్రాహ్మణుల వల్లే దళితులకు వ్యతిరేకంగా ఆనాడు రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డాయని' విమర్శించారు. కుల వ్యవస్థ రద్దుపై బ్రాహ్మణుల వైఖరి వెల్లడించాలన్నారు. దళితులను గుడిలోకి రానివ్వకపోవడంతో క్రైస్తవులు వారిని చర్చిలోకి తీసుకెళ్లారని, మిషనరీల ద్వారా విద్యా, వైద్య సేవలను అందించారన్నారు. దళితుల మెడమీద కత్తిపెట్టి మతం గురించి శాసించడం ఘోరమైన అవమానంగా పేర్కొన్నారు. సిక్కు, బౌద్ధ మతాల్లో చేరిన దళితులకులాగా క్రైస్తవ దళితులకు ఎస్సీ హోదా ఇచ్చేవరకు ఉద్యమిస్తానని మంద కృష్ణ ప్రకటించారు.

**బీసీ, ఎస్టీ, అగ్రవర్ణ పేదలకు లేని ఆంక్షలు వీరికే ఎందుకు?**

**దళితులకు వ్యతిరేకంగా నాటి రాష్ట్రపతి ఉత్తర్వులకు.. ఆ నలుగురు బ్రాహ్మణులే కారణం**

**మంద కృష్ణమాదిగ సంచలన వ్యాఖ్యలు**



## శ్రీపాదరావు ఆశయ సాధనకు నిరంతరం శ్రమిస్తాం

- **అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యాన్ని ఎవరు ఆపలేరు**
- **అనవసరంగా రాజకీయ విమర్శలు చేసే వారిని పట్టించుకోం**
- **ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు**

**మంథని, ఏప్రిల్ 13 (జనోదయ):** మంథని నియోజకవర్గ ప్రజలందరికి సేవ చేయాలని, విద్య, వైద్య, రవాణా, తాగు, సాగు నీరు లాంటి కనీస సౌకర్యాలను కల్పించాలని జీవితాంతం తపన పడిన తన తండ్రి మాజీ శాసన సభా స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్పష్టంచేశారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీపాదరావు విగ్రహానికి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. శ్రీపాదకాలనీలో ఏర్పాటు చేసిన శ్రీపాద రావు విగ్రహాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. శ్రీపాదరావు స్ఫూర్తితో ప్రజాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లో పని చేస్తామన్నారు. తన తండ్రి శ్రీపాదరావు ఆశయాలను కొనసాగిస్తూ మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి మంచి పేరు తీసుకు వస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యాన్ని ఎవరు ఆపలేరన్నారు. అనవసరంగా రాజకీయ విమర్శలు చేసే వారిని పట్టించుకోమన్నారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రీపాదరావు రాజకీయ జీవితం ప్రజా సేవ చేయాలనే వారికి ఆదర్శప్రాయమన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేసిన భౌతికంగా దూరమైన ఇన్నేళ్ళు ప్రజల గుండెల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఐలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, శశిభూషణ్‌కాచే, ముస్కుల సహేందర్‌రెడ్డి, సెగ్గెం రాజేష్, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆదివాసీ, గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చేస్తాం

**రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు వచ్చేలా చర్యలు : సీఎం రేవంత్**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం చెక్ డ్యామ్‌ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు అటవీశాఖ అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన, ఆదివాసీ ఎమ్మెల్యేల బృందం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసి ఏజెన్సీ ప్రాంతాల్లోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. గిరిజన రైతులు సాగు భూముల్లో బోర్లు వేసుకోవడానికి అనుమతులపై సానుకూలంగా స్పందించారు. ఐటీడీఏలను మరింత బలోపేతం చేస్తామని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



## 22 నుంచి సమ్మె

**ప్రకటించిన ఆర్టీసీ జేఏసీ నేతలు**

**పరిశీలనలో ఆర్టీసీ విలీనం: పొన్నం**




**హైదరాబాద్, ఏప్రిల్ 13 :** టీజీఎస్ఆర్టీసీలో మరో సారి సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఇచ్చిన హామీల అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మెకు దిగుతామని గత నెల 13న ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చింది. అయితే, ఆ నోటీసుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం, కార్మిక శాఖ వద్ద జరిగిన రెండు సమావేశాలకు ఆర్టీసీ అధికారులు గైర్హాజరు కావడంతో తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. గతంలోనూ సమ్మెకు ఒక్క రోజు ముందు ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం తో వెనక్కి తగ్గామని, ఈ సారి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసా గిస్తామని జేఏసీ నేతలు తెలిపారు. కాగా, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ప్రేరేపిత సమ్మెలకు వెళ్లవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశం కమిటీ పరిశీలనలో ఉందన్నారు. ఆర్టీసీ పరిధిలోని సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. 2018 నుంచి విద్యుత్ బస్సులు దశల వారీగా వస్తున్నాయని, ఇది కేంద్రం తీసుకున్న నిర్ణయమని చెప్పారు. విద్యుత్ బస్సుల వల్ల ఉద్యోగాలు పోతాయనే అపోహ సరికాదని అన్నారు. ఆర్టీసీలో పని చేసి రిరైర్డ్ అయిన వారు యూనియన్ నాయకులుగా చలామణి కావడం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు. సమ్మె విషయంలో కార్మికులు, నాయకులు పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఏ పార్టీతోనూ పొత్తులుండవు

- **రాష్ట్రంలో ఒంటరిగానే అధికారంలోకి వస్తాం రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే**
- **50 ఏళ్లకు పైగా దేశాన్ని ఏలిన కాంగ్రెస్.. మహిళా బిల్లును ఎందుకు అమలు చేయలేదు?**
- **ఖానాపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**ఖానాపూర్, ఏప్రిల్ 13 :** తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చెప్పారు. భవిష్యత్తులో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవన్నారు. తాము సొంతంగానే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా అం కం మౌనిక బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 400 మంది ఎంపీల బలమున్న సమయంలో సైతం రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టలేకపోయారన్నారు. బిల్లును ప్రవేశపెట్టకపోగా ఒక వర్గం మహిళల కోసం చట్టాన్నే మార్చారని ఆరోపించారు. అదే వర్గం మహిళలకు అండగా నిలిచేందుకు ప్రధాని మోదీ ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశారని గుర్తు చేశారు. తలసరి ఆదాయాన్ని బట్టి సీట్లు కేటాయించాలని రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు అర్థం లేనివ న్నారు. రేవంత్‌రెడ్డిది నియంతృత్వ ధోరణి అని, పేదవాడు పేదవాడిగానే ఉండేలా ఆలోచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అన్నది బీజేపీ విధానమని.. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అది నిరూపితమైందని చెప్పారు. వైస్ చైర్మన్ పదవిని ఎవరికి ఇచ్చామో చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ వేర్వేరు కాదన్న విషయం మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి నిరూపితమైందని రాంచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో కొత్త పార్టీలను ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని.. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.



# జనగామ గ్రామంలో రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం



జనోదయ : ఆర్ సి చెన్నూర్ ఏప్రిల్ 13

ఈ రోజు జనగామ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మారిశెట్టి పద్మ.అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు కింది సూచనలు తెలియజేయడం జరిగింది:మద్యం సేవించి వాహనం నడపరాదుహెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు.రహదారులు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తలండి ముత్తయ్య కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిమాజీ ఎంపీపీ వెంకటస్వామి మాజీ ఎంపీటీసీ తిరుపతి వార్డు సభ్యులు రాజన్న తిరుపతి మధునయ్య మహేష్ నాయకులు గట్టు తిరుపతి గౌడ్ కార్యకర్తలు పాటు యువత మరియు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా శ్రీపాద వర్ధంతి

**నివాళులర్పించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**అన్నదానం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ**



జనోదయ : గోదావరిఖని, ఏప్రిల్ 13

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయదుద్దిల్ల శ్రీపాద రావు 27వ వర్ధంతిని సోమవారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరిఖని బస్టాండ్ ఎదురుగా గల శ్రీ పాద రావు విగ్రహం వద్ద,రామగుండం ఎమ్మెల్యే రాజ్ టాకూర్తోపాటు పలువురు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విచ్చేసి,శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి వినమ్రంగా నివాళులు అర్పించారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ,శ్రీ పాద రావు ప్రజాసేవలో చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ,వారి ఆశయాలను కొనసాగించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి ,డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.అదేవిదంగా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో శ్రీపాద రావు వర్ధంతిని పురస్కరించుకొని హనుమాన్ నగర్ లోని ప్రైమరీ స్కూల్ పిల్లలకు ప్లేట్లు,మరియు గ్లాసుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్,కాల్వ లింగస్వామి,కార్పొరేటర్,దూళికట్ట సతీష్,దాసరి విజయ్,కనకలక్ష్మి, ముప్పి రవికుమార్ యాదవ్,కాదాసి శేఖర్,పోయిల సాగర్, వంశీ ప్రతాప్,బైరిమల రాజ్ కుమార్,కమల్,పాల్గొన్నారు.

### ప్రమాదాల సమయంలో

# గోల్డెన్ అవర్‌ను వినియోగిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స**

**సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన ఏరైవ్ - ఏలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**






జనోదయ : (మంథని) పెద్దపల్లి, ఏప్రిల్ - 13

ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌ను సద్వినియోగం చేసుకుంటే ప్రాణాలను రక్షించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన ఏరైవ్ – ఏలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులు , ఇతర రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నదని తెలిపారు. గత సంవత్సరం జిల్లాలో సుమారు 30 మంది బాధితులకు ఈ సహాయం అందించినట్లు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటామనే అపోహలు ప్రజల్లో ఉన్నాయని,అలాంటి భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహా వీర్ పథకం క్రింద రూ. 25 వేల ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు.ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంట గోల్డెన్ అవర్‌గా ఉండి, ఈ సమయంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.గోల్డెన్ అవర్ లో చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు.ఈ పథకాలు త్వరలో అమల్లోకి రానున్నాయని తెలిపారు.రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని సూచించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో పిల్లలకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భషీరొద్దీన్, ట్రాఫిక్ ఏ.సి.పి.శ్రీనివాస్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎకో పార్క్‌ను పరిశీలించిన పాలక వర్గం



జనోదయ : మంథని

మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఎకో పార్కును సోమవారం మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంథని మున్సిపాలిటీ లోని ఎకో పార్కు నూతన సౌకర్యాలతో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మియాపూర్ సర్కిల్-48లో

## ప్రజావాణి-7 ఫిర్యాదులు స్వీకరణ




జనోదయ : శేరిలింగంపల్లి, ఏప్రిల్ 13

మియాపూర్ సర్కిల్–48 పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 7 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని,వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. విభాగాల వారీగా అందిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి.టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన 2 ఫిర్యాదులు,ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన 4 ఫిర్యాదులు,యూబీడీ (యుబిడి) విభాగానికి సంబంధించిన 1 ఫిర్యాదు అందాయి.రెవెన్యూ,(యుసిడి), ఎలక్ట్రికల్ విభాగాలకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. అలాగే హెల్త్ అండ్ సానిటేషన్ విభాగానికి కూడా ఫిర్యాదులు నమోదు కాలేదు.అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పంపించి,వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి,వాటి పరిష్కారంపై దృష్టి సారించారు.

### శ్రీపాదరావు విగ్రహానికి

## నివాళులర్పించిన మంత్రి, ప్రభుత్వ విప్



జనోదయ : మంథని

మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా మంథనిలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కలిసి శ్రీపాద రావు విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా నాయకులు,అభిమానులు 'శ్రీపాద రావు అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు,భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

### పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

జనోదయ : హనుమకొండ ఏప్రిల్ 13

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు హనుమకొండ,వరంగల్,జనగామ జిల్లాల పరిధిలో నిర్వహించబడుతున్నాయి.ఈ నేపథ్యంలో హనుమకొండలోని కాలోజి కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్సీ బస్వరాజు సారయ్య,వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రా రంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ,"రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకం.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చు.హెల్మెట్ ధరించడం,సీటు బెల్ట్ వినియోగించడం, మితి మీరిన వేగంతో వాహనాలు నడపకపోవడం వంటి ప్రాథమిక నియమాలను తప్పనిసరిగా పాటించాలి.ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలి. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం" అని పేర్కొన్నారు.అనంతరం రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.పోలీస్ జాగృతి బృందం , తెలంగాణ సాంస్కృతిక సారథి, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు రోడ్డు భద్రతపై నిర్వహించిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుని,ప్రజల్లో అవగాహన పెంపొందించాయి.అంతకుముందు పోలీసుల ఆధ్వర్యంలో కాళోజి కళాక్షేత్రం ఆవరణలో ఏర్పాటుచేసిన సాల్స్ లో వరంగల్ కమిషనరేట్ పలు ప్రాంతాల్లో జరిగిన ఘోరమైనరోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలను ఏర్పాటు చేసి, సదరు వాహనం రోడ్డు ప్రమాదానికి గురి కావడానికి గల కారణాలు, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే సామాగ్రిని పోలీస్ అధికారులు ఎంఎల్సీ,పోలీస్ కమిషనర్,జిల్లా కలెక్టర్లుకు వివరించారు.ఈ కార్యక్రమంలో డిసిపిలు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి,రవి,అదనపు డిసిపి ప్రభాకరరావు, ఏఎస్పీ శుభం, ట్రాఫిక్ ఏసీపీలు సత్యనారాయణ, నర్సింహారావు, ప్రశాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి,వెంకన్న,సుజాత,టి.టి.సి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,హనుమకొండ, కేయుసి,సుబేదారి ఇన్‌స్పెక్టర్లు శివకుమార్,రవికుమార్,రంజిత్‌తో పాటు పోలీసు,రవాణా,రెవెన్యూ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,కౌన్సిలర్లు,సర్పంచులు,కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## చందానగర్‌లో సరస్వతి విద్యా మందిర్‌లో

# నూతన మల్టీపర్పస్ హాల్ ప్రారంభం

జనోదయ : శేరిలింగంపల్లి ఏప్రియల్ 13

చందానగర్ డివిజన్ పరిధిలోని చందానగర్‌లో గల సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ హాల్‌ను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ గా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి,శ్రీ నార్నె శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌కు చెందిన లయన్ ఘట్టమనేని బాబు రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ..ఆధునిక విద్యా విధానంలో స్మార్ట్ బోర్డు సాంకేతికతతో కూడిన తరగతి గదులు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.సరస్వతి శిశుమందిరాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని,విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మల్టీపర్పస్ హాల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హాల్ నిర్మాణానికి విరాళాలు అందించిన విజేత సూపర్ మార్కెట్ చైర్మన్ మానుకొండ జగన్మోహన్ రావు, యు.వి.రమణ మూర్తి, కోడే లీలావతి, కోడే గోపాల రావు, రావిపాటి స్వప్న, వలిగే పవన్ కుమార్ తదితర దాతలను ఘనంగా సన్మానించారు.అలాగే ఈ విద్యా సంవత్సరంలో సహకరించిన ఇతర దాతలను కూడా అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి,మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు జనార్దన్ రెడ్డి,శేఖర్ రెడ్డి,పాఠశాల అధ్యక్షుడు వంగల్లు రామచంద్రారెడ్డి,ట్రెజరర్ జి.నాగభూషణరావు,ఉపాధ్యక్షుడు కె.సుదీప్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి ఎం.నరేంద్ర ప్రసాద్,సభ్యుల,ధీరజ్ కుమార్,శ్రీపాల్ రెడ్డి, దుర్గా మహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జేఏసీ



జనోదయ : మంథని

ఆర్టిజన్,అన్మాండ్,పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ నాయకులు సోమవారం మంథనిలో మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రంఅందజేశారు.విద్యుత్ ఉద్యోగుల సమ్మె ఆరో రోజుకు చేరినా ప్రభుత్వం స్పందించకపోవడంపై జేఏసీ కన్వీనర్ తుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

## మృతుడి కుటుంబానికి

# ప్రమాద బీమా చెక్కు పంపిణీ



జనోదయ : మంథని

మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్వల్పకాలిక ఋణం తీసుకొని రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన ఉడుత చంద్రయ్య కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు మంజూరు కాగా,సంఘ అఫీషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్‌కెడిసిసి బ్యాంకు మేనేజర్ కె.ఉదయశ్రీ, డిఈ సందేబోయిన శ్రీనివాస్ తో కలిసి సోమవారం సాయంత్రం అతని భార్య స్వరూప కు అందజేశారు. సంఘం యందు స్వల్పకాలిక ఋణం తీసుకున్న ప్రతీ ఒక్క రైతుకు సహకార సంఘం ద్వారా ప్రమాద భీమా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, ఏఎంసి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య, మాజీ సర్పంచ్ పొయిల రాజయ్య, నాయకులు కావటి సమ్మయ్య, సందీప్, బుదారపు సతీష్, నాంపల్లి రంజిత్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కై

# అన్ని రంగాల కార్మికులు ఉద్యోగులు ఉద్యమించాలి

### సిఐటీయు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్

జనోదయ : వరంగల్ ప్రతినిధి

దేశంలోని యావత్ అన్ని రంగాల ఉద్యోగ,కార్మికులు భారతరాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని,భారత రాజ్యాంగం ఉద్యోగులకు కార్మికులకు కల్పించిన హక్కులను హరించే విధానాలు తీసుకొస్తూ.సామాజిక అణిచివేతలకు పాల్పడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని సిఐటీయు జిల్లా కార్యదర్శిఆరూరి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని,సిఐటీయు ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ – సవాళ్లు, కార్మికుల పాత్ర అనే అంశంపై జిల్లా సెమినార్ నిర్వహించడం జరిగింది.మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాష్ అధ్యక్షతన వహించిన కార్యక్రమానికి ముఖ్యవక్తగాసిఐటీయు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో నేటికీ కులవివక్ష, అంటరానితనం అసమానతలు నిరక్షరాస్యత కొనసాగుతున్నాయని బడుగు బలహీన వర్గాలు, దళిత సామాజిక వర్గాలకు సంబంధించిన కార్మికులు రెండు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని ఒకటి తను పనిచేసే ప్రాంతంలో చాలీచాలని వేతనాల సమస్యలు, పనిభారం, ఇలాంటి అనేక సమస్యలతో పాటు, సామాజిక అణిచివేతలకు గురవుతున్నారని వారు నివసించే ప్రాంతాల్లో సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీరికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాకపోవడమే ప్రధాన కారణమని,కేంద్ర బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు కేంద్రం బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని అందులో భాగంగానే దళితలు క్రిస్టియన్ మతంలోకి వెళితే ఎస్సీ హోదా ను తొలగిస్తామని, కుట్రలో పండుతున్నారని ఈ కుట్రలను తిప్పికొట్టడంలో ప్రతి ఒక్కరు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అందుకోసం సిఐటీయు కార్మిక ఉద్యమాలతో పాటు సామాజిక సమస్యలపై ఉద్యమిస్తుందని ఆయన తెలిపారు.ఈ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.సిఐటీయు జిల్లా అధ్యక్షులు మహమ్మద్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థానంలోనే అనేక వివక్షలకు గురై ఉన్నత విద్యను అభ్యసించి నేడు ప్రపంచ మేధావిగా నిలిచాడని ఆయన ఆశయాలు కొనసాగించాలని అన్నారు.మున్సిపల్ ఎంప్లాయ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు సింగారపు బాబు మాట్లాడుతూ.. కార్మికులు ప్రస్తుతం నడుస్తున్న రాజకీయాల తీరులను అర్థం చేసుకోవాలని పాలక వర్గాలు మోసపూరిత వైఖరులను ఎండగట్టేందుకు ఉద్యమించాలని అందుకోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు చదివి ఆచరించి హక్కులను సాధించుకోవాలని అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉసిల్ల కుమార్ మాట్లాడుతూ.. దళితులపై జరుగుతున్న కులవివక్ష పై ఐక్య ఉద్యమాలు చేయాలని, అంబేద్కర్ జీవితం, పోరాటం ఒక స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ జిల్లా సెమినార్ ప్రారంభానికి ముందు నాయకత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సింగారపు కృష్ణ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి జీవన్ కుమార్,సాంబయ్య,రామకృష్ణ,వినయ్, భిక్షపతి,ప్రభాకర్,దాసు,రాజేశ్వర్,కవిత,సుజాత పాల్గొన్నారు.





జనోదయ



# రోడ్డు భద్రతపై ఎక్లాస్పూర్‌లో పోలీసుల అవగాహన కార్యక్రమం

జనోదయ : మంథని

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంథని మండలంలోని పలు గ్రామాల్లో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఎగ్లాస్పూర్ గ్రామంలో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు




ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రహిత ప్రాంతంగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,ప్రజాప్రతినిధులు,యువత పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు భద్రతా నియమాలు పాటించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

# రామగుండంలో
# ఎమ్మార్వో కుర్చీ ఖాళీ.. ఫైళ్లు పెండింగ్

**నియోజకవర్గం అస్తవ్యస్తం.. ఎమ్మెల్యే మౌనం**

**ప్రజా సమస్యల కంటే రాజకీయాలే ముఖ్యమా?**

**కలెక్టర్ కదలి రావాలి, తక్షణమే ఎమ్మార్వోను నియమించాలి**

**బీజేపీ నేత కందుల సంధ్యారాణి**

జనోదయ : గోదావరిఖని, ఏప్రిల్ 13





రామగుండం నియోజకవర్గంలో ప్రభుత్వ పాలన గాడి తప్పి, సామాన్యుడి గోడు వినే నాథుడే కరువవ్వగా, అటు అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, ఇటు పాలకుల ఉదాసీనత వెరసి రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని చెప్పడానికి ఇక్కడి కార్యాలయాల దుస్థితే సజీవ సాక్ష్యం అని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు రామగుండం బిజెపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి. నిత్యం ప్రజా సమస్యలతో కిటకిటలాడాల్సిన రామగుండం తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం పూర్తిస్థాయి ఎమ్మార్వో లేక వెలవెలబోతుండగా,ఇన్చార్జ్ పాలనలో ఫైళ్లు అటకెక్కి సామాన్యులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించే వారు లేకపోవడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం నిత్యం అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, పైసలు ఇస్తేనే పనులు జరుగుతాయన్న రీతిలో బరితెగించి వ్యవహరిస్తుంటే, అక్రమార్కుల అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది అని అన్నారు. మరీ ముఖ్యంగా విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ పైచదువుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు నివాస, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందక వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంటే, తమ పిల్లల అడ్మిషన్ల కోసం సర్టిఫికెట్లు రాక తల్లిదండ్రులు అనుభవిస్తున్న నరకయాతన వర్ణనాతీతంగా ఉంది. అసలు నియోజకవర్గంలో ఇంతటి దారుణ పరిస్థితులు తాండవిస్తున్నా రామగుండం ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నారని, ఆయనకు ప్రజల సమస్యల కంటే రాజకీయాలే ముఖ్యమా అని ప్రశ్నిస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా కలెక్టర్ తక్షణమే కలుగజేసుకొని రామగుండం మండలానికి శాశ్వత ప్రాతిపదికన ఎమ్మార్వోను కేటాయించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ను కోరుతూ అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సులవ లక్ష్మీ నరసయ్య- పద్మ, తడగొండ నరసయ్య మరియు అంతర్గాం మండల అధ్యక్షులు బోడకుంటి సుభాష్, ఊరకొండ అపర్ణ, వెల్తూరి రజిత రాజయ్య,గోగుల రమేష్,ఆలకుంట మహేష్, చిలువేరి కుమార్, బూడిద హర్ష,రామగిరి నరేష్,అందే రాజ్ కుమార్ చారి, బాలసాని సత్తయ్య గౌడ్,అంకరి భరత్,కొట్టే నరేష్,జక్కన బాలు, హనుమాన్ల వెంకటేష్,జక్కుల ప్రవీణ్-పద్మ,శిలారపు కళ్యాణ్, శ్రీకాంత్, ఎరుకొండ తిరుపతి,ఎల్తపు రాజు,బండారి శ్యామ్ పటేల్, బియ్యాల శ్రీకాంత్,బుంగ మహేష్,శంకరమ్మ,తీగుట్ల నవీన్,మాదర బోయిన రాకేష్,సునీల్,ఐలేష్,సాయి,కోడూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మధు తండాలో రేషన్ డీలర్ గోదాముపై టాస్క్‌ఫోర్స్ దాడి

**"65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం"**

**-నిందితురాలు డీలర్ పోరిక కమల అరెస్ట్.. రూ.2.27500/- లక్షల బియ్యం సీజ్.. 6 కేసు నమోదు**

జనోదయ : వరంగల్ ప్రతినిధి





అక్రమంగా డంప్ చేసిన 65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రేషన్ డీలర్‌గా ఉన్న మహిళను అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజు, ఆర్ఎస్ఐ ఓ. భానుప్రకాష్ నేతృత్వంలోని బృందం హనుమకొండ జిల్లా కోమటిపల్లి మండలం మధు తండాలోని డీలర్ దుకాణంపై దాడి చేసింది. కెయుసి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధు తండాలో పోరిక కమల (45), భర్త బిక్షపతికి చెందిన రేషన్ డీలర్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన 130 బస్తాల పీడీఎస్ బియ్యం బయటపడింది. మొత్తం 65 క్వింటాళ్ల బియ్యం ఉండగా, దీని విలువ రూ. 2,27,500/- ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితురాలు పోరిక కమల ఎస్టీ (లంబాడా) సామాజిక వర్గానికి చెందినది. రేషన్ డీలర్‌గా ఉంటూనే ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు నిల్వ చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న 65 క్వింటాళ్ల బియ్యంతో పాటు నిందితురాలు పోరిక కమలను తదుపరి చర్యల కోసం కెయుసి పోలీసులకు అప్పగించారు. నిందితురాలిపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 6గా కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు,ఆర్ఎస్ఐ ఓ.భానుప్రకాష్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. అరెస్టయిన నిందితురాలి వివరాలు: పోరిక కమల,భర్త బిక్షపతి,వయస్సు 45 సం. కులం:లంబాడ,వృత్తి: రేషన్ డీలర్,నివాసంమధు తండా,కోమటిపల్లి, జిల్లా: హనుమకొండ.

**ముందస్తు అడ్మిషన్ల పేరిట ప్రైవేటు పాఠశాలల దందా**

# నిద్ర మత్తులో విద్యా శాఖ అధికారులు

డి.హీరేహాళ్



జనోదయ : శేరిలింగంపల్లి ఏప్రియల్ 13

ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు పేరుతో తల్లిదం డ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయనే ఆరోపణలు పెరుగుతున్నాయని ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ అన్నారు విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇంకా నెలలు ఉండగానే అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించి, సీట్లు పరిమితం అంటూ తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. కొన్ని పాఠశాలలు భారీగా అడ్వాన్స్ ఫీజులు వసూలు చేస్తూ, రసీదులు ఇవ్వకుండా నగదు తీసుకుంటున్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. విద్యా వ్యవస్థలో ఇంత తతంగం జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు చూసి చూడనట్టుగా నిద్ర మత్తులో ఉన్నారని పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళనతో తల్లిదండ్రులు ఈ ఒత్తిడికి లోనవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాలు ప్రకారం, పాఠశాలలు అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా అడ్మిషన్లు చేపట్టాలి. అలాగే ఫీజుల వివరాలు పారదర్శకంగా ప్రకటించాల్సి ఉంది. అయినప్పటికీ కొన్ని ప్రైవేటు సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు అలాగే ఇలా ముందస్తు అడ్మిషన్ల దందాకు పూనుకున్న విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని అన్నారు.

**కేంద్రం చీకటి ఒప్పందాలు**

# విరమించుకోవాలి

"రాజనాల శ్రీహరి"

**పోచమ్మ మైదాన్‌లో కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష విరమణ**

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 10 రోజుల దీక్షకు ముగింపు**




జనోదయ : వరంగల్ ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ.. విదేశాలతో చీకటి ఒప్పందాలు చేసుకుంటోందని, తక్షణమే వాటిని విరమించుకోవాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు, యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ ఆధ్వర్యంలో గత 10 రోజులుగా పోచమ్మ మైదాన్ సెంటర్‌లో కేంద్రం రైతులకు అన్యాయం చేస్తోందంటూ.. చేపట్టిన 'కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష' ఆదివారం విరమించారు. దీక్ష విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. "మోడీ ప్రభుత్వం ఇక్కడ రైతులను మోసం చేస్తూ.. విదేశాలలో చీకటి ఒప్పందాలు చేసుకుంటోంది. ఆ ఒప్పందాలను వెంటనే విరమించుకోవాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దిలీప్, ఏపీవైసీజీ ఎస్ సప్న, ఏలియా గౌడ్‌తో పాటు వందమంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో
# ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

**మంథని ఏఎంసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**ఐటి,పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**జనోదయ : మంథని**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ళు చేపట్టాలని ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., మంథని ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మంథని ఏఎంసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శాసన సభ్యులు విజయరమణ రావు, ఠాకూర్ మక్కా సింగ్, ఏ ఎంసీ చైర్మన్ కుదుదుల వెంకన్న పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐటి,పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ,కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముక్కుల సహేంద ర్ రెడ్డి, టీజీ ఈ



ఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, ఆర్ టి ఐ మెంబర్ మంథని సురేష్, ఏ ఏం సి వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, అనంత రెడ్డి,మాజీ ఎంపీపీ కొండ శంకర్,మాజీ ఏ ఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్,మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ పెండ్లి రమ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి,డీఎం శ్రీకాంత్,డి సి ఎస్ ఓ, సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి అనిల్ కుమార్,ఏ డి ఏ అంజనీ మిశ్రా, ఏవో నవ్య, ఏఎం సి కార్యదర్శి సతీష్,సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్లు,ఏ ఎంసీ డైరెక్టర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర కాదు.. పొర్లు దండాల యాత్ర పెట్టినా
# కేటీఆర్‌ను ఎవరూ పట్టించుకోరు

**బీఆర్ఎస్‌కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చేశారు**

**14వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కుంభం శివపటేల్**

**జనోదయ : వరంగల్ ప్రతినిధి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర కాదు పొర్లు దం డాల యాత్ర పెట్టినా తెలంగాణ ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేద ని 14వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ డివిజన్ యూత్ కాం గ్రెస్ అధ్యక్షుడు కుంభం శివపటేల్ స్పష్టం చేశారు.ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేటీఆర్,బీఆర్ఎస్‌పై నిప్పులు చెరి గారు."బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చినా పీకేదేమీ లేదు.బీఆర్ఎస్ అయినా,టీఆర్ఎస్ అయినా తెలంగాణ ప్రజలు వాళ్లకి వీఆర్ఎస్ ఇచ్చేశారు"అని పేర్కొన్నారు."కల్వకుంట్ల కుటుంబం అంటేనే కుట్రల కుటుంబం.పదేళ్లు తెలంగాణ అమరులను,ప్రజాసంఘాలను,ఉద్యో గ సంఘాలను గోస పెట్టారు"అని ఆరోపించారు."కొంగ జపం చేస్తున్న కేటీఆర్ గత పదేళ్లు ప్రజలనే కాదు సొంత పార్టీ నేతలను కూడా పట్టించుకోలేదు"అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిని ఆకాశంతోపోలుస్తూ."రేవంత్ రెడ్డి ఆకాశం లాంటి వాడు.ఆకాశం పై ఉమ్మేస్తే వాళ్ల మొహంపైనే పడుతుంది. తుడ్చుకోలేక, కడుక్కోలేక కేటీఆర్ ఇబ్బంది పడుతారు"అని వ్యాఖ్యానించారు. "పాదయాత్ర కా దు పొర్లు దండాల యాత్ర పెట్టినా కేటీఆర్‌ను ఎవరూ పట్టించు కో రు. కేటీఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి



లేదు.ఇప్పటికైనా సిగ్గు లేని పనికిమాలిన రాజకీయాలు మానుకోండి.తస్మాత్ జాగ్రత్త" అని శివపటేల్ హెచ్చరించారు.

# క్షణిక వేగం.. జీవిత కాలపు శోకం!

**హెల్మెట్టే 'శిరస్త్రాణం'.. ప్రాణాలకు 'రక్షా కవచం'**

**చింతలపల్లిలో 'అరైవ్-అలైవ్' గర్జన..**



**జనోదయ :ఎల్కతుర్తి**

"నువ్వు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కేవలం ఒక వ్యక్తిగా వెళ్తావు.. కానీ తిరిగి వచ్చేటప్పుడు నీ భార్యకు భర్తగా, పిల్లలకు తండ్రిగా, తల్లిదండ్రులకు కొడుకుగా రావాలి. నీవు క్షేమంగా తిరిగి రావడం నీ కుటుంబానికి అత్యంత అవసరం" అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అత్యంత భావోద్వేగంతో వాహనదారులకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా, రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చేపట్టిన 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో భారీ ఎత్తున అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ నిర్వహించారు.కేవలం వేదికల మీద ప్రసంగాలకే పరిమితం కాకుండా, సీపీ సన్ ప్రీత్ సింగ్ స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ గ్రామ వీధుల్లో పర్యటించి ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఆయన వెంట సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత కూడా బైక్ నడిపి, హెల్మెట్ ధారణ ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈ ర్యాలీలో వందలాది మంది గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సభలో చింతల పల్లి గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. "మా గ్రామంలోకి హెల్మెట్ లేని వాహన దారులకు ప్రవేశం లేదు" అని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, రోడ్డు భద్రతలో తాము ఎంతటి నిబద్ధతతో ఉన్నామో చాటిచెప్పారు. ఈ సాహసోపేతమైన నిర్ణయాన్ని సీపీ మనస్ఫూర్తిగా అభినందించారు.అనంతరం సీపీ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎస్.ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, గ్రామ సర్పంచ్ రజితా రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో పాటు భారీ సంఖ్యలో పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్టుల హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110